అర్చక ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వ కృషి అమోఘం


రవీంద్రాచార్యులు

సనత్‌నగర్: దేవాదాయశాఖ మంత్రిగా కొండా సురేఖ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అర్చక, ఉద్యోగులకు లబ్ధి చేకూరేలా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలుపరచడం పట్ల అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు హర్షం వ్యక్తంచేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఉద్యోగుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించడంతో పాటు 33 మంది జూనియర్ అసిస్టెంట్లకు ఈఓలుగా పదోన్నతులు కల్పించారని ఆయన గుర్తుచేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం


పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న మహ్మద్ యాసిన్, అబ్బు

రసూల్‌పురా: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా రసూల్‌పురాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహ్మద్ యాసిన్, మహ్మద్ అబ్బు పారిశుద్ధ్య కార్మికులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ అబ్దుల కలామ్ ఆశయాలు నేటి విద్యార్థులు, యువత అనుసరించాలని ఆ మహనీయుని జయంతి రోజు గౌరవార్థం ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా నిర్వహించడం మన దేశానికే గర్వకారణమని అన్నారు.

దాతల సహకారం మరువలేనిది


డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: నల్లగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శౌరి అన్నారు. మంగళవారం సనాతన ట్రస్టు నిర్వాహకులు సుబ్రహ్మణ్యం సతీమణి పద్మ శ్రీ జ్ఞాపకార్థం పాఠశాలకు 7 డిజిటల్ తర గతులుగా ఆధునీకరణ, సీసీ కెమెరాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కూడా కొంత మంది దాతల సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు శౌరి వివరించారు. పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం మానవతా దృక్పథంతో చేస్తున్న సేవలు ఎప్పటికి నిలిచిపోతాయని అన్నారు.

తార్నాకలో అబ్దుల్ కలాం జయంతి


ఏపిజే అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

లాలాపేట: భారత మాజీ రాష్ట్రపతి ఏపిజే అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికి ప్రేరణ కావాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఏపిజే అబ్దుల్ కలాం 93వ జయంతి వేడుకలను నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించిన ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైంటిస్టుగా విద్యా, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో కలాం దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, పవన్ కళ్యాణ్, రాజు,అనిల్, చంద్రమౌళి తదితరులున్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కిలోల్లో.. రూ. టమాటా.47, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 85, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 23, క్యారెట్ 45, దొండ 35, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 40, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 37, చామగడ్డ 37, మొరంగడ్డ 35, కందగడ్డ 65, సొరకాయ 17, పొట్లకాయ 23, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

చీమల పుట్టలో పాములు

చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరిన చందంగా మారింది మెట్టుగూడలో జీహెచ్ఎంసీ అధికారులు నిర్మించిన మార్కెట్ స్టాల్స్ పరిస్థితి. ఈ మార్గంలో ఫుట్‌పాత్ వ్యాపారాలను నియంత్రించడానికి మార్కెట్‌ను నిర్మించారు. ఇక్కడి గుర్తింపు పొందిన స్ట్రీట్ వెండర్స్‌కు మార్కెట్‌లో స్టాల్స్ కేటాయించడం ద్వారా వెండర్స్‌కు ఉపాధి, ట్రాఫిక్ సమస్యలకు మార్గం సుగమం చేయాలనుకున్నారు. రెండేళ్ల క్రితం స్టాల్స్ కేటాయింపు కోసం సన్నాహాలు చేస్తున్న తరుణంలోనే ఈ మార్కెట్‌లోని 50 స్టాల్స్ పరాధీనం పాలయ్యాయి.

సికింద్రాబాద్


మెట్టుగూడలో జీహెచ్ఎంసీ మార్కెట్ స్టాల్స్‌లో వెలసిన వ్యాపారాలు

పేదల దుకాణాల్లో పెద్దల పాగా

- పేదలకు దక్కని మెట్టుగూడ మార్కెట్ స్టాల్స్
- దురాక్రమణ దారులదే రాజ్యం
- ఫుట్‌పాత్ వ్యాపారాలు యధాతథం
- స్పందించని జీహెచ్ఎంసీ అధికారులు

› స్టాల్స్ కేటాయింపులో జీహెచ్ఎంసీ అధికారులు జాప్యం చేసిన ఫలితంగా ఇందులో 30 మంది ప్రైవేటు వ్యక్తులు పాగా వేశారు. రాజకీయ పలుకుబడి కలిగిన పలువురు స్టాల్స్ ను స్వాధీనం చేసుకుని ఇతరులకు అద్దెలకు ఇచ్చుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో మెట్టుగూడకు చెందిన ఒక ప్రజాప్రతినిధి స్వలాభాపేక్ష కారణంతో స్టాల్స్ పరాధీనం పాలయ్యాయి.

నెరవేరని జీహెచ్ఎంసీ లక్ష్యం...

ఇదే రహదారిపై ఏళ్ల తరబడి సుమారు 50 మంది చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరందరు జీహెచ్ఎంసీ అధికారులు గుర్తించిన వ్యాపారులు కావడం గమనార్హం. వ్యాపారులు మొత్తంగా నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. అదీ కాకుండా వీరి వ్యాపారాలతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

› కొత్తగా నిర్మించిన స్టాల్స్‌కు వ్యాపారాలు బదలాయిస్తే ట్రాఫిక్‌సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేందని జీహెచ్ఎంసీ అధికారులు భావించారు. ఇదిలా ఉండగా 50 మందికి కేటాయించాల్సిన స్టాల్స్‌ను కేవలం 30 మంది మాత్రమే మొత్తంగా ఆక్రమించారు.

› మరో 20 మందికి వ్యాపారాలు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఇతరులకు అవకాశం ఇవ్వడం లేదని పలువురు చిరు వ్యాపారులు ఆవుదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో ఎక్కువ మంది ఆక్రమణదారులు స్టాల్స్‌ను చిరు వ్యాపారులకు అద్దెలకు ఇచ్చుకుని రోజుకు రూ.1000 వరకు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఇక్కడి వ్యాపారులు ఎవరూ జీహెచ్ఎంసీకి ఒక్క రూపాయి అద్దె కూడా చెల్లించక పోతుండడం గమనార్హం.

విచారణ జరిపించాలని డిమాండ్

› మెట్టుగూడలో నిర్మించిన మార్కెట్ స్టాల్స్‌లో కొనసాగుతున్న వ్యాపారాల నిర్వహణపై విచారణ జరిపించాలని స్ట్రీట్ వెండర్స్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన స్ట్రీట్ వెండర్స్ కోసం నిర్మించిన మార్కెట్ స్టాల్స్ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్టాల్స్‌ను సొంతం చేసుకుని జీహెచ్ఎంసీకి టువంటి అద్దె చెల్లించకుండా స్టాల్స్ అద్దెలకు ఇచ్చుకుని పెత్తనం చెలాయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని వారు జీహెచ్ఎంసీ అధికారులకు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యలు యధాతథం...

ట్రాఫిక్ సమస్యల నివారణ కోసం వెండర్స్ గుర్తింపు కోసం జీహెచ్ఎంసీ అధికారులు కసరత్తులు చేస్తున్న సమయంలోనే స్టాల్స్‌ను గత ప్రభుత్వహయాంలో దురాక్రమణలు చేశారు. అప్పట్లో అధికార పార్టీకి చెందిన పెద్దలే స్టాల్స్ దురాక్రమణలను ప్రోత్సహించారు. ఒక్కరిద్దరు ప్రజాప్రతినిధులు స్టాల్స్‌ను ఇతరులకు అనధికారికంగాక్రయించుకుని సొమ్ము చేసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి.

› అధికార పార్టీ నాయకులే స్టాల్స్ దురాక్రమణలను ప్రోత్సహించడంతో మున్సిపల్ అధికారులు అచేతనంగా ఉండిపోయారు. దీంతో ఫుట్‌పాత్ వ్యాపారాలు ఫుట్‌పాత్‌లపైనే ఉండిపోయాయి. సెలవు, పండగ దినాల్లో ఇటు స్టాల్స్, అటు ఫుట్‌పాత్ వ్యాపారాల వద్ద వాహనాలు లెక్కకు మించి నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రం అవుతున్నాయి.


అదే రహదారిపై కొనసాగుతున్న ఫుట్‌పాత్ వ్యాపారాలు

› జీహెచ్ఎంసీ నిర్మించిన మార్కెట్ స్టాల్స్‌ను స్ట్రీట్ వెండర్స్‌కు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు అధికార పార్టీ నాయకులు కూడా డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా మెట్టుగూడ మున్సిపల్ మార్కెట్‌లో వ్యాపారాలు కొనసాగుతున్న తీరు, అందులో జరుగుతున్న అవకతవకలకు సంబంధించి విచారణ జరుపుతామని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు.

ఓయూలో అలంకార ప్రాయంగా కార్యాలయాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో అనేక కార్యాలయాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ (సీటీఎస్), సెంటర్ ఫర్ డిజెబిలిటీస్ రిసోర్స్, ఉమెన్స్ స్టడీస్, హర్టికల్చర్ అండ్ గ్రీన్ బెల్ట్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్, ఎస్సీ, ఎస్టీ సెల్, బీసీ సెల్, మైనార్టీ సెల్, ఓయూ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సెంటర్, ఎంటర్‌ప్రెన్యూరర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండోపసిఫిక్ స్టడీస్ తదితర కేంద్రాలు అలంకార ప్రాయంగా ఉన్నాయి. అధ్యాపకుల కొరత కారణంగా ఒక్కరికి రెండు కంటే ఎక్కువ పదవులు, బోధన, పరిశోధ తదితర పని భారంతో పాటు నిధుల కొరత కారణంగా ఆయా కార్యాలయాలలో చేయాల్సిన పనులు మరుగున పడ్డాయి. మరుగున పడుతున్న కార్యాలయాలపై వీసీ, రిజిస్ట్రార్లు శ్రద్ధ చూపాలని ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు.

రెండో రోజు ప్రైవేటు కాలేజీల్లో బోధన బంద్

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రవేటు డిగ్రీ, పీజీ కాలేజీల యజమానుల ఆందోళన కారణంగా రెండో రోజు పాఠాలు జరగలేదు. విద్యార్థులకు గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ రుసుము రూ.6 వేల కోట్లను విడుదల చేయనందుకు నిరసనగా కాలేజీలను నిరవధికంగా బంద్ చేశారు. కాలేజీల బంద్ డిగ్రీ విద్యార్థులు రెండు రోజులు క్లాసులు నష్టపోయారు. ఇదిలా ఉండగా నేటి నుంచి వివిధ పీజీ కోర్సుల ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల తరగతులు ప్రారంభంకానున్నాయి. అయితే ప్రైవేటు కాలేజీల బంద్ వలన పీజీ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో సీటు సాధించిన పీజీ ప్రవేశాలకు రేపటితో (17న) గడువు ముగియనుండున మొదటి సంవత్సరం విద్యార్థులు నిరాశచెందుతున్నారు. బంద్ కారణంగా ప్రవేశాలకు గడువు పొడిగించాలని ఓయూ అధికారులను కోరారు.

వైభవంగా విగ్రహాల ఊరేగింపు


తార్నాక చింతల్‌లో అమ్మవారి నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్న బండ చంద్రారెడ్డి

లాలాపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తార్నాకలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలు గత తొమ్మిది రోజుల పాటు భక్తుల నుంచి విశిష్ట పూజలందుకున్నారు. వివిధ రూపాల్లో భక్తులు ఆదిశక్తిని ఆరాధించుకున్నారు. భాజా భజంత్రీలు, వివిధ వేషధారణలో కళాకారులు, యువకుల నృత్యాలతో అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. తార్నాకలో యువ సేనా యూత్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని సోమవారం రాత్రి నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దివ్య, మల్లేశ్వరీ,రేఖ, అలేఖ్య, నరేష్, శ్యామ్,బాలు, సాయి, నరేష్ తదితరులున్నారు.

రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి మంగళవారం పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలతో పాటు ప్రైవేటు కాలేజీలు, పాఠశాలల నిర్వాహకులు, విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇతర పనుల పై ఉన్న శ్రద్ధ విద్యా రంగం పై లేనందున చదవులు కుంటుపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగం ఎదుర్కొంటున్న వాటిల్లో ప్రధానంగా వీసీల నియామకాల్లో జాప్యం, నిలిచిపోయిన పీజీ అడ్మిషన్స్, విద్యాశాఖకు మంత్రి లేకపోవడం, పెండిగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల పై నిర్లక్ష్యం, అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలు, కళాశాలలు, హాస్టల్స్‌కు నిధులు కేటాయించకపోవడం, అతిథి అధ్యాపకుల వేతనాల పెండింగ్, రూ.6 వేల కోట్ల ఫీజు రీఆంబర్స్‌మెంట్ నిధుల చెల్లించనందున ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల నిరవధిక బంద్ వలన మూతపడిన తరగతి గదులు, డీఎస్సీలో తాజాగా టీచర్ ఉద్యోగం సాధించిన అభ్యర్థుల కౌన్సెలింగ్ వాయిదా తదితర అనేక సమస్యలతో విద్యా వ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. అనేక పనుల్లో బిజీగా ఉంటున్న సీఎం రేవంత్ రెడ్డి విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆర్ఎల్ మూర్తి ఆరోపించారు. ఇకనైన మంత్రిని నియమించి విద్యాశాఖలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పెద్దమ్మ గుడిలో సెల్‌ఫోన్ చోరీ

బంజారాహిల్స్: అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలి సెల్‌ఫోన్ చోరీకి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బోడుప్పల్ తారాపురికాలనీకి చెందిన దాసరి చాందిని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జూబ్లీహిల్స్‌లోని శ్రీపెద్దమ్మ దేవాలయానికి దర్శనం కోసం వచ్చింది. దర్శనం ముగించుకుని హ్యాండ్‌బ్యాగ్‌లో సెల్‌ఫోన్ కోసం చూడగా కనిపించ లేదు. వెంటనే అన్ని ప్రాంతాలు వెతికినా ఫలితం లేకుండాపోయింది. దీంతో ఆమె జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నవరాత్రుల్లో 17 సెల్‌ఫోన్ల చోరీ

నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన మహిళా భక్తులను లక్ష్యంగా చేసుకుని దొంగల ముఠా వారి సెల్‌ఫోన్లను తస్కరించారు. దీంతో తొమ్మిది రోజుల్లో మొత్తం 17 సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. సుమారుగా 10-15 మంది దొంగల ముఠా తొమ్మిది రోజులపాటు ఇక్కడ తిష్టవేసి పోలీసులకు దొరక్కుండా చాకచక్యంగా హ్యాండ్‌బ్యాగ్‌లకు చిల్లులు పెట్టి వాటిలోని ఫోన్లను చోరీ చేశారు. ఇదిలా ఉండగా రోజూ వేలాది మంది భక్తులు వస్తారని తెలిసినా పెద్దమ్మ గుడి యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోలేదు. ఇక్కడ భక్తుల తాకిడికి సుమారుగా 60 నుంచి 70 సీసీ కెమెరాలు ఉండాల్సి ఉండగా కేవలం 15 మాత్రమే ఏర్పాటు చేశారు. అందులోనూ నాలుగైదు పనిచేయడం లేదు. ఆలయంలో గొలుసులు, సెల్‌ఫోన్లు చోరీలకు గురవుతు న్నాయని గత కొన్నేళ్లుగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా గుడి యాజమాన్యం లెక్కచేయడం లేదు. సెల్‌ఫోన్లు దొంగతనం జరిగినప్పుడు సీసీ ఫుటేజీలు పరిశీలించడానికి వెళ్లిన పోలీసులకు కూడా స్పష్టత లేకుండా పోతుంది. దీంతో దొంగల ముఠా ఎప్పటికప్పుడు తప్పించుకుంటూ ఆదివారం వచ్చిందంటే తమ చేతులకు పనిచెబుతున్నారు.

మహిళా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: జెక్‌కాలనీ మహిళలు నిర్వహించే కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. జెక్‌కాలనీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు మంగళవార ఎమ్మెల్యేను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే సమాజ వికాసం జరుగుతుందని, అందుకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. జెక్‌కాలనీ మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు తన మద్దతు ఉంటుందని హామీనిచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చింతిరెడ్డి ప్రభ, అన్నపూర్ణ, ప్రతినిధులు లంకా హైమావతి, పూర్మాని భాగ్యలత, అమరావతి తదితరులు ఉన్నారు. అలాగే బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించేలా తమ సహకారాన్ని అందించిన కాలనీ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లు ప్రసాద్, రాజశేఖర్‌చందు, శివారెడ్డి, పూర్మానీ మల్లారెడ్డి, భాషాలకు మహిళా సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న బతుకమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రతి ఇంటి నుంచీ చెత్తను సేకరించాలి



స్వచ్ఛ రిక్షాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: ప్రతి ఇంటి నుంచీ చెత్త సేకరణ చేపట్టడం ద్వారా హైదరాబాద్ మహానగరాన్ని క్లీన్ సిటీగా మార్చాలనీ జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తార్నాకలోని తన కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు స్వచ్ఛ ఆటో రిక్షాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ చెత్తను బయట పారవేయవద్దని ప్రజలకు సూచించారు. క్లీన్ అండ్ గ్రీన్ సిటీకి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రతి కార్మికుడు తమకు కేటాయించిన ప్రాంతంలో ఉదయం 5 గంటల నుంచే చెత్త సేకరణ పనులు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, ఎస్ఎఫ్ఏలు, పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం చెట్ల నరికివేత

- పట్టించుకోని అధికారులు

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో భారీ చెట్లను కొందరు యథేచ్ఛగా నరికివేస్తున్నారు. తాజాగా తార్నాక నుంచి హబ్సిగూడ వెళ్లే మార్గంలో ఆర్టీసి బస్ షెల్టర్ వద్ద ఫుట్‌పాత్‌పై ఏపుగా పెరిన ఓ భారీ చెట్టును కొందరు దుండగులు రాత్రికి రాత్రే నరికేశారు. తెల్లారేసరికి ఆ చెట్టుకు సంబంధించిన ఆనవాలు అక్కడేమీ లేకుండా చేశారు. గతంలో ప్రభుత్వాలు ఫుట్‌పాత్‌లపై నాటిన మొక్కలు నేడు చెట్లుగా మారాయి. అయితే అవి ప్రస్తుతం తమ వ్యాపార సముదాయాలకు అడ్డుగా ఉన్నాయంటూ ఇలా కొందరు వ్యాపారులు రోజుకో చెట్టును నేలమట్టం చేస్తున్నారు.

› గతంలో తార్నాక చౌరస్తా నుంచి లాలాపేటకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం తాజా కిచెన్ హోటల్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఉన్న నాలుగు చెట్లను తమ హోటల్‌కు అడ్డుగా ఉందని రాత్రికి రాత్రే నరికివేయించారు. చెట్టు మొదలు కనిపించకుండా పై నుంచి సిమెంట్ వేసి కప్పేసారు.

› తార్నాక స్ట్రీట్ నెంబర్ 1లో ఓ డెంటల్ క్లినిక్ నిర్వాహకుడు తన క్లినిక్‌కు అడ్డుగా ఉందని ఓ భారీ చెట్టునే తొలగించేశాడు.

› గతంలో బిగ్ బజార్ ప్రస్తుతం రిలయన్స్ మార్ట్ ముందు ఉన్న రెండు చెట్లను షాపింగ్ మాల్‌కు అడ్డుగా ఉన్నాయంటూ తొలగించారు.


తార్నాకలో ఫుట్‌పాత్‌పై చెట్టును నరికివేసి దృశ్యాలు.

పత్తా లేని అధికారులు...

ఒక వైపు భారీ చెట్లు నేలమట్టమవుతున్నా పట్టించుకునే వారు లేరని పర్యావరణ వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హరిత హారం పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ మొక్కటు నాటుతున్నారు. నాటిన మొక్కల సంరక్షణ దేవుడెరుగా కానీ ఇప్పటికే ఉన్న చెట్లను ఇంటి నిర్మాణాలకు అడ్డుగా ఉన్నాయంటూ, వ్యాపారాలకు అడ్డుగా ఉన్నాయంటూ ఇలా పలు కారణాలతో చెట్లను నరికివేస్తుంటే పర్యావరణ పరిరక్షణ చేసే అధికారులు ఎక్కడ ఉన్నారంటూ తార్నాక వాసులు ప్రశ్నిస్తున్నారు. చెట్లను నరికివేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనీ తార్నాక వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ముత్యాలమ్మ దేవాలయంలో మొదలైన పూజలు


దేవాలయంలో పూజలు చేస్తున్న స్థానికులు

రాంగోపాల్‌పేట్: కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో మంగళవారం పూజలు మొదలు పెట్టారు. ఈ నెల 14వ తేదీన దుండగుడు అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం విదితమే. బస్తీ ప్రజలు, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికలు తదితరులు మంగళవారం ఉదయంలో సంప్రోక్షణ చేయించారు. అలాగే అమ్మవారిని ఆవాహనం చేసి కలశస్థాపన చేశారు. వేద పండితుల సూచన మేరకు దేవాలయంలో పూజలు ఆగిపోకుండా ఉండేందుకు కలశ స్థాపన చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కొద్ది రోజుల పాటు ఇలాగే పూజలు కొనసాగించి వేదపండితులు, పెద్దల సూచనల మేరకు అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నారు. మంగళవారం ఎన్‌డీఎంఏ మాజీ ఉపాధ్యక్షులు మర్రి శశిధర్‌రెడ్డి, కార్పొరేటర్లు కొంతం దీపిక, రాజ్యలక్ష్మి, సునిత తదితరులు అమ్మవారి దేవాలయాన్ని సందర్శించారు.

విషమంగానే నిందితుడి పరిస్థితి

అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసి పట్టుబడిన నిందితుడి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు నిందితుడ్ని పట్టుకుని దేహశుద్ధి చేయగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. నిందితుడు ఇంకా స్పృహలోకి రాలేదని, వస్తే ఎక్కడి నుంచి వచ్చాడు, ఎందుకు వచ్చాడు అన్ని వివరాలు తెలుస్తాయని మార్కెట్ పోలీసులు చెబుతున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: పోలీసు ఉద్యోగుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మంగళవారం ఆర్థికశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావుకు వినతి పత్రం సమర్పించిన్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. పోలీసులకు రెండు సంవత్సరాలుగా 15 టీఏలు, 5 డీఏ పీఆర్సీలు, టెరియర్స్, మెడికల్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. మెడికల్ బిల్లుల పెండింగ్ వలన పోలీసులకు ప్రవేటు ఆసుపత్రులు చికిత్స చేయడం లేదని వివరించిన్నట్లు తెలిపారు.